ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023



కార్మికుల ముఖహాజరు రద్దుపై పోరాటం

సాలూరు : మున్సిపల్ కార్మికులకు ముఖహాజరు రద్దు కోరుతూ దశలవారీ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహిళా కార్యదర్శి టి.ఇందు, జిల్లా ఉపాధ్యక్షులు టి.రాముడు, పట్టణ కార్యదర్శి టి.శంకర్ చెప్పారు. శనివారం దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ వర్తింపజేయడం వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు పొంచి ఉంటుందని అన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ దశలవారీగా పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10నుంచి 15వరకు ఎమ్మెల్యేలు మంత్రులకు వినతులు అందజేయడం, ఈనెల 15న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం, ఈనెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరవడం జరుగుతుందని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.ఇందు, రాముడు, శంకర్ హెచ్చరించారు.



అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి దామోదరరావు

లోక్‌అదాలత్‌కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్థానిక కోర్టు భవనంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతంగా జరిగింది. రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు, సీనియర్ సివిల్‌జడ్జి జి.యజ్ఞనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డిసౌజన్య ఆధ్వర్యంలో ఈ లోక్‌అదాలత్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన 13, సివిల్ కేసులు15, ఎస్టీసి1250, ఐపిసి 20, నేరపూరిత సంబంధిత కేసులు 155, మెంటెనెన్స్ కేసులు 05, ఎన్ఐ చట్టం కేసులు 03, సివిల్ అప్పీల్ 02, క్రిమినల్ అప్పీల్ 01, మొత్తం 1473 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు.

సాలూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో 750కేసులు పరిష్కార మయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్ ఆధ్వర్యాన లోక్ అదాలత్ జరిగింది వీటి.5 సివిల్ కేసులు, 51క్రిమినల్ కేసులు,2చెక్ బౌన్స్ కేసులు,ఒక గృహ హింస కేసు,691 సెకెండ్ క్లాస్ కోర్టు కేసులు పరిష్కార మయ్యా యి. కార్యక్రమంలో ఎపిపి మాధవి,బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు టి.మురళీకృష్ణ, న్యాయవాదులు శర్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- గురుగుబిల్లి బిసి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్ డిమాండ్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విద్యార్థుల శ్రద్ధ పట్ల ఉన్నత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపాల వల్ల సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు బస చేస్తున్నాయని అధికారులు వాటిపై దృష్టి పెట్టి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం గరుగుబిల్లిలో గల బిసి సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలు జిల్లా అధికారుల దృష్టిలో పెడతామని, పరిష్కారం కానిచో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గరుగుబిల్లి బిసి వసతి గృహం రికార్డులో 65మంది విద్యార్థుల పేర్లు నమోదై ఉన్నాయని, కాని రోజుకు 40 మంది విద్యార్థులకే వంట చేస్తున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. రెండే మరుగుదొడ్లు వాడుకలో ఉన్నాయని, వాటికి కూడా ట్యాపులు లేక నిరంతరం నీరు పోతూనే ఉందని, నీరు ట్యాంకు కింద పగుళ్లు ఏర్పడడంతో నీరు నిల్వ ఉండకుండా నిరంతరం వృథాగా పోతూనే ఉందని తెలిపారు. మరుగుదొడ్లు వద్ద, వసతి గదుల్లో కరెంటు వైర్లు వేలాడుతూనే ఉన్నందున్న విద్యార్థులు భయాందోళనకు గురైతున్నారన్నారు. ఇటీవల కాలంలో ఒక విద్యార్థి విద్యుత్‌షాక్‌కు గురైనట్టు విద్యార్థులు తెలిపారని అన్నారు. చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో పశువులు, పందులు, కుక్కలు హాస్టల్ ఆవరణను సర్వనాశనం చేస్తున్నాయని, దీనివల్ల విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తాగు నీరు లేక బయట నుంచి తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు. తరచు మోటరు రిపేరవుతున్న సందర్భంలో స్నానం చేయకుండానే పాఠశాలలకు పోతున్నామని విద్యార్థులు అన్నారని తెలిపారు. ఆరుబయట లైట్లు లేకపోవడం వల్ల పాములు చేస్తున్నాయన్నారు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదన్నారు.



హాస్టల్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

వంట మనిషి, వాచ్మెన్ లేనందున అటెండరు, స్వీపరులే వంట చేపడుతున్నారని అన్నారు. ఇన్ని రకాల సమస్యలు ప్రతి రోజూ విద్యార్థులు ఎదురుకుంటున్నారని, ఉన్నత అధికారులు హాస్టల్ సందర్శన సందర్భంలో విద్యార్థులతో ఎటువంటి సంప్రదింపులు చేపట్టకపోవడంతో సమస్యలు బయటకు రానీయకుండా వార్డెన్ ఎన్.శ్రీను దాచివేస్తున్నారని, వార్డెన్ ఉన్నతాధికారులు ఏకమై విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వెంటనే జిల్లా శాఖ అధికారులు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే వార్డెన్ శ్రీనును విధుల నుంచి తొలగించాలని, ఉన్నతాధికారులపై తగిన చర్యలు చేపట్టాలని, లేకుంటే భవిష్యతులో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న గిరిజన, మాతృభాష వాలంటీర్ల సంఘం నాయకులు

వాలంటీర్ల రెన్యువల్‌కు మంత్రి హామీ

రాజన్నదొరను కలిసిన గిరిజన, మాతృభాష వాలంటీర్ల సంఘం నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న మాతృభాష వాలంటీర్ల రెన్యువల్‌కు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తానని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్నదొర హామీ ఇచ్చారు. శనివారం మాతృభాష వాలంటీర్ల సంఘం, గిరిజన సంఘం నాయకులు మంత్రి రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి మాతృభాష వాలంటీర్ల రెన్యువల్ చేయాలని సంబంధిత ఐటిడిఎలను కోరినట్లు చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు జారీ చేస్తే భారతీయ సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద మంజూరైన నిధులతో మాతృభాష వాలంటీర్లను కొనసాగిస్తామని ఐటిడిఎ అధికారులు చెపుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి రాజన్నదొర మాట్లాడుతూ మాతృభాష వాలంటీర్ల రెన్యువల్‌కు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాతృభాష వాలంటీర్ల సంఘం నాయకులు ఎస్.ఆనంద రావు, సరంబు నాయుడు, చిట్టిబాబు, ఎస్.డోంబు, మాసయ్య, ఎల్లంగు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తిరుపతిరావు, మండంగి రమణ, జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు, నాయకులు కె.అవినాష్, మండల నాయకులు వంతల సుందరరావు, జానకీరావు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన గుడ్లు

అంగన్‌వాడీలకు కుళ్లిన గుడ్లు

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న అంగనవాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ పోషణ కిట్టు ద్వారా 2 కేజీలు గోధుములు, అరకేజీ శెనగ చెక్కీలు, అరకేజీ ఖర్జూరం, అరకేజీ బెల్లం, అరకేజీ చోడిపిండి చొప్పున కిట్‌ను బాలింతలకు, గర్భిణులకు ఇంటికి అందజేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే కేంద్రంలో వీరికి ఇస్తున్న పాలు, గుడ్డు ఒకెత్తు. కొంతవరకు పాలు బాగానే ఉన్నప్పటికీ గుడ్లు మాత్రం కుళ్ళ వాసన వస్తుండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు గుడ్డు తినకుండా పారివేస్తున్నారు. మండలంలోని శనివారం అంగన్వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు అందిన గుడ్లు నాసిరకంగా ఉండడమే కాకుండా చిన్నవిగా ఉన్నాయి. అందులో ఒక గుడ్డును తూకం వేయగా దాని బరువు 20 గ్రాములు ఉంది. 50 గ్రాములు ఉండాల్సిన గుడ్డు 20 గ్రాములు మాత్రమే ఉంది. అంటే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నాణ్యమైన గుడ్డు అందించాలనే లక్ష్యాన్ని అధికారుల పర్యవేక్షణా లోపం లేక చూసీ చూడనట్లు వ్యవహరించడం గానీ, నాణ్యమైన గుడ్డు అయితే మాత్రం అందడం లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన గుడ్డును అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంఇఒను సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కోనలో ఈనెల 8న విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కుళ్ళిన గుడ్లు, కలుషితమైన నీరు తాగి, ఉడకని అన్నం తిని అస్వస్థతకు గురై హాస్పిటల్ పాలైన ఘటనలో మక్కువ ఎంఇఒ వి.మల్లేశ్వరరావును సస్పెండ్ చేయాలని సిపిఎం నాయకులు సిహెచ్ తవిటినాయుడు, గంగునాయుడు డిమాండ్ చేశారు. శనివారం కోనలో జరిగిన ఘటనపై విచారం చేపట్టడం జరిగిందని శనివారం విలేకరులకు తెలిపారు. పాఠశాల హెచ్ఎం జయకుమార్‌తో ఎంఇఒ వి.మల్లేశ్వరరావు కుమ్మక్కయిన ఘటన జరిపించడానికి పథకం వేసినట్లు అర్ధమవుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఎంఇఒకు స్వయాన పిన్ని అయిన రౌతు సింహాచలం వయసు పైబడినప్పటికీ సుమారు 65 ఏళ్లు ఉన్నప్పటికీ గత ఆరేళ్ల క్రితం మిడ్ డే మీల్స్ ఏజెన్సీలో సహాయకురాలిగా అడ్డగోలుగా నియమించారని పేర్కొన్నారు. అమెను పూర్తిస్థాయి నిర్వాహకురాలిగా చేసేందుకు గత 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న గొట్టాపు లక్ష్మిని గత 8ఏళ్లుగా హెచ్ఎం జయకుమార్‌తో కుమ్మక్కై ఎంఇఒ అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ మిడ్ డే మీల్స్ వంటను విడిచి పెట్టాలని అనేక రకాలుగా ఒత్తిడి చేశారని నాయకులు ఆరోపించారు.

ఆరు క్వింటాళ బియ్యం పై స్పష్టత ఏది ?

రెండు సందర్భాల్లో బియ్యం స్కూల్లో హెడ్ మాస్టర్ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు దొంగతనానికి గురైందని రెండుసార్లు సుమారు 6 క్వింటాళ్ల వరకు దొంగలించారని అభియోగం చేసి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎవరు తీశారనేది ఇప్పటికీ తేల్చలేదని అన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు గొట్టాపు లక్ష్మికి నెలకు రూ.4వేలు ఇస్తామని హెచ్ఎం జయకుమార్ మాస్టారు అనేక నెలలుగా ఇబ్బంది పెడుతున్నప్పటికీ విద్యార్థుల సంక్షేమం కోరుతూ లక్ష్మి వంట వదులుకోవడానికి ఇష్టపడకుండా బిల్లుల సకాలంలో రాకపోయినప్పటికీ అనేక ఇబ్బందులు గురైనప్పటికీ నడిపిస్తుందని, కక్షపూరితంగా ఈనెల8న హెచ్ఎం జయ కుమార్ కావాలని పథకం ప్రకారం ఉడకని అన్నం విద్యార్థులకు పెట్టించారని విమర్శించారు. అలాగే వాటర్ ట్యాంకులో కప్పలు అనేక రోజులుగా ఉన్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. కావున మొత్తం వ్యవహారం ఎంఇఒ, ఇప్పుడున్న నిర్వాహకులను తొలగించి తన పిన్నిని పూర్తిస్థాయి నిర్వాహకు రాలిగా చేసేందుకు హెచ్ఎంతో పన్నాగం పన్నినట్టు అర్థమవుతుందని విమర్శించారు. అంతేకాక మండలంలో అనేక గ్రామాల్లో ఎంఇఒ సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. సారాయివలసలో రెండేళ్ల క్రితం మిడ్ డే మీల్స్ ఏజెన్సీకి స్థానిక హెచ్ఎం బియ్యం మూడు మాసాల పాటు ఇవ్వకపోతే తన సొంత నిధులతో బియ్యం కొని నిర్వాహకులు నడిపించారన్నారు. ఈ విషయమై ఎంఇఒ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ స్పందించలేదన్నారు. ఈ విషయంపై సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేసిన తర్వాత బియ్యం ఇచ్చారని, ఎంఇఒ తన సొంత లాభం కోసం చూస్తున్నారని అందుకే కోన లాంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే ఎంఇఒను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

- సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ, లక్షలాది మందితో జరుగుతున్న కార్మిక,కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి రైతు సంఘం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కెఎల్‌పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సదస్సు జరిగింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్య నారాయణ ప్రధాన వక్త గా పాల్గొని ప్రసంగించారు.

సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు పొట్నూరు శంకరరావు, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడు అప్పారావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ గోపాలం మాట్లాడారు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ మూర్తి, జిల్లా కమిటీ సభ్యులుగెద్ద లక్ష్మి, కోటి, తదితరులు పాల్గొన్నారు

నిర్లక్ష్యం వహిస్తున్న ఎఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలసలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న ఎఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు డిమాండ్ చేశారు. శనివారం పండుతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ఎఎన్ఎం సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మందులు అందుబాటులో వుంచడం లేదని విద్యార్థులు చెప్పినట్లు తెలిపారు. ఎఎన్ఎం నిర్లక్ష్యం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి

మక్కువ : మక్కువ మండలంలోని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కొండగొర్రి యోగీశ్వరి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరుణ్ డిమాండ్ చేశారు. శనివారం వారు మండలంలోని ఎర్రసామంత వలసలో యోగీశ్వరి తల్లిదండ్రులను పరామర్శించారు. సెలవులకు ఇంటికి వచ్చిన యోగీశ్వరిని అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేర్పించామని, ఈ విషయం తెలియజేసినా పాఠశాల ఉపాధ్యాయులు స్పందించలేదని తల్లిదండ్రులు చెప్పారని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన కెజిబివి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మృతురాలికి కుటుంబానికి రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పండు

జిల్లా ఖజానా అధికారి గణేష్ మృతి

విజయనగరం : జిల్లా ఖజానా అధికారి ఎస్ఆర్‌కె గణేష్ శనివారం తెల్లవారి కన్నుమూశారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతికి మూడు జిల్లాల ఖాజానా అధికారుల సంఘం నాయకులు , అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఖజాన శాఖ డిడి ఆర్ఎఎస్ కుమార్, ఎటిఒ నితిన్ జోసి, ఎటిఒ ఆదిత్యాసింగ్, ఎపిటిఎస్ఎ పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్, తదితరులు సంతాపం తెలిపారు.

కన్నడంలోకి నారంశెట్టి నవల అనువాదం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పట్టణానికి చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త, ఉత్తరాంధ్ర రచయితల వేదిక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. ఆయన రచించిన పిల్లల నవల 'ఈతరం కుర్రాడు' ఇప్పుడు కన్నడంలోకి అనువదింపబడింది. 2017లో తానా (ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్) నిర్వహించిన బాలల నవలల పోటీలో నారంశెట్టి రాసిన ఈతరం కుర్రాడు బాలల సాహస నవల ఉత్తమ నవలగా బహుమతి పొందింది. ఆ నవలను హైదరాబాదుకు చెందిన ప్రముఖ పుస్తక ప్రచురణల సంస్థ మంచి పుస్తకంగా ప్రచురించింది. ఆ నవలకు చక్కని పాఠకాదరణ లభించడంతో ప్రచురించిన




కాపీలన్నీ తొందరగానే అమ్ముడుపోయాయి. దీంతో మళ్లీ కాపీలను ముద్రించింది సంస్థ. ఆ నవలకు విశేషాదరణ లభించడంతో పాటు నారంశెట్టికి మంచి పేరు ప్రఖ్యాతులు దక్కాయి. కాగా ఆ నవలను ఇప్పుడు బళ్లారికి చెందిన రచయిత శ్రీ వీరేంద్ర రవిహాళ్ కన్నడ భాషలోకి అనువదించారు. అనువాద పుస్తకాన్ని ఈనెల 16న కర్నాటకలోని విజయపుర జిల్లాలో ఆవిష్కరిస్తున్నట్టు ఆహ్వాన పత్రికను నారంశెట్టికి పంపారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందిన నా ఆనంద లోకం నవలను ఇతర భారతీయ భాషల్లోకి సాహిత్య అకాడమి తర్జుమా చేయిస్తుందని తెలుసు. ఇప్పుడు ఇ-తరం కుర్రాడు నవల కన్నడ భాషలోకి అనువాదమై కన్నడిగులకు చేరువ కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు నారంశెట్టిని అభినందించారు.

ఆచరణపైనే అనుమానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల ప్రభుత్వం తీరుసుకున్న పలు నిర్ణయాలు హర్షణీయం. జిల్లా అభివృద్ధికి ఎంతోకొంత దోహదపడతాయి. కానీ, వాటి అమలు, అందుకు చూపే చిత్తశుద్ధిపైనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ అనుమానాలను తొలగించాలంటే వచ్చే ఎన్నికల వరకు నాన్చుడు ధోరణి అవలంభించి, 'మళ్లీ అధికారంలోకి వస్తే చేసి చూపిస్తాం' అని చెప్పేందుకు ప్రయత్నించకుండా ఒక అడుగు ముందుకు వేయాల్సివుంది.

ఈనెల 7వ తేదీన జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో భోగాపురం మండలంలో 90 ఎకరాల్లో ఐటి పార్కు ఏర్పాటు చేస్తామని, ఎస్.కోట దరి మూలబొడ్డవరలో గతంలో అల్యూమినా కంపెనీ కోసం సేకరించిన 985ఎకరాల భూమిని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు కేటాయిస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఐటి పార్కు ఏర్పాటు చేస్తే స్థానికంగా కొంతమందికైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. అలాగే అల్యూమినా కంపెనీ ఎలాగూ పెట్టలేదు కాబట్టి ఆ స్థానంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల వెనుకబడిన విజయనగరం జిల్లా పారిశ్రామికంగా ఒక్క అడుగైనా ముందుకు వేసేందుకు అవకాశం కలుగుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రత్యక్షంగా పరోక్షంగా కలుగుతాయి. ఇంత వరకు బగానే ఉన్నా వాటి అమలు విషయంలో ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇప్పటి వరకు మన జిల్లాకు సంబంధించినంత వరకు ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు పెద్దగా నెరవేరలేదు. ఈ మాటకొస్తే టిడిపి ప్రభుత్వం ఏర్పాడ్డాక చెప్పినవి కూడా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గతంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అది మన జిల్లాకు అన్వయించుకుంటే విజయనగరాన్ని పారిశ్రామిక నగరంగాను, స్మార్ట్ సిటీగాను మారుస్తామని, లలిత కళల సంగీత అకాడమీ ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఫుడ్‌పార్కులు ఏర్పాటుచేస్తామని, సముద్ర తీరంలో పోర్టు నిర్మిస్తామని, ఏడాదిలో తోటపల్లి



ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేసి, శతశాతం సాగునీరు అందిస్తామని, మెడికల్ కాలేజీ, గిరిజన వర్శిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. భోగాపురంలో తలపెట్టిన ఇంటర్నేషల్ ఎయిర్‌పోర్టు కూడా తామే పూర్తిచేస్తామంటూ నమ్మబలికింది. ఎన్నికలకు ముందుకు గురజాడ పేరిట ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామంటూ అప్పటి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ప్రకటించింది. కానీ, వీటిలో గిరిజన వర్శిటీని పారాయి పంచన ప్రారంభించడం మినహా మరేవీ అమలుకు నోచుకోలేదు. గిరిజన యూనివర్శిటీ ప్రారంభమై సుమారు నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ వైసిపి హయాంలోనూ శాశ్వత ప్రాతిపదికన భవన సముదాయం లేదు. లేబొరేటరీ, గ్రంథాలయం వంటివి కూడా లేకపోవడంతో అక్కడి విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలపై ఆధారపడుతున్నారు. ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీలకు ఇంకా భూసేకరణే పూర్తికాలేదు. మెడికల్ కాలేజీ పనులు మాత్రం వైసిపి అధికారంలోకి వచ్చాకే ప్రారంభమయ్యాయి. తోటపల్లి ప్రాజెక్టుపై అటు టిడిపి, ఇటు వైసిపి నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇప్పటికీ లక్ష్యంలో 60శాతానికి మించి సాగునీరు అందడం లేదు. ఇక మిగిలినవాటి ఆచూకీయే లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన ఐటి పార్కు, స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ జిల్లా వాసుల్లో ఒకింత ఆశలు రేకిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈనేపథ్యంలో హామీలను ఎన్నికలకు ముందే అమలు చేస్తే ప్రభుత్వాన్ని విశ్వసించే పరిస్థితి ఉంటుందని, లేదంటే టిడిపి, వైసిపి దొందూ దొందే అన్న చందంగా అనుకోవాల్సి వస్తుందని పబ్లిక్ టాక్. వీటికితోడు బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశం జిల్లాలో పాలనా సౌభ్యానికి, పలు అభివృద్ధి పనులకు నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం అర్బన్‌ను ప్రత్యేక మండలంగా గుర్తించేందుకు తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వ సేవలు త్వరితగతీన అందుతాయనే ఆశాభావం విజయనగరంవాసుల్లో వ్యక్తమౌతోంది. జిల్లా కేంద్రంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు, లీగల్ సర్వీస్ ఇనిస్టిట్యూట్‌లో పోస్టుల భర్తీకి నెల్లిమర్ల నగర పంచాయతీని విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో వీనం చేసేందుకు, నెల్లిమర్లలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్లు ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపడం పట్ల కూడా హర్షం వ్యక్తమౌతోంది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా కోట జానకీ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జానకీరావు మండల అధ్యక్షుడిగా మూడోసారి, గణేష్ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు గౌరవ అధ్యక్షులుగా సింగారపు సింహాచలం, సహాధ్యక్షులుగా సిహెచ్.లక్ష్మి, కోశాధికారిగా ఎస్.కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎ.మన్మధరావు, ఎవి రామారావు, సిహెచ్.జగదీశ్, అన్సారీ బేగం, బి.మధుసూదనరావు, టి.మేరీగోల్డ్, పివి మహాలక్ష్మి, కె.మీన, సిపిఎస్ సబ్‌కమిటీ కన్వీనర్‌గా ఎస్.శ్రీనివాసరావు, కో-కన్వీనర్లుగా జి.కృష్ణ, గంగరాజు, దివాకర్, అన్నపూర్ణ, సావిత్రి, ఐటిడిఎ సబ్‌కమిటీ కన్వీనర్‌గా అంబటి సీతయ్య, మహిళా కమిటీ కన్వీనర్‌గా స్వరాజ్యలక్ష్మి, కో..కన్వీనర్లుగా రజని, లక్ష్మీ, ఈశ్వరమ్మ, సారా గ్రేస్, కృష్ణవేణి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రసాద్, కో కన్వీనర్లుగా మోహనరావు, నాగరాజు, రమేష్, సుగుణాకర్, ఈశ్వరరావు, కార్యదర్శులుగా చంటి, అశోక్, గౌరీశంకర్, గౌరీసు, శ్రీనివాసరావు, వేణుగోపాల్ రావు, మంగులు, రాము, సుశీల ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎం.శంకరరావు వ్యవహరించారు. మండల శాఖ నూతన కార్యవర్గాన్ని జిల్లా సహాధ్యక్షులు బి.విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ఎ.రమేష్ అభినందించారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. రాజా కళాశాల మైదానం, కోటిచెరువు గట్టుపై రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని శనివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన పని చేసే పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.యుగంధర్ ఉన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపితోనే గిరిజన సంక్షేమం

నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

టిడిపితోనే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని సాలూరు నియోజక వర్గ ఇంఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని మరిపల్లి పంచాయతీ వెలగవలస, గంగన్నదొరవలస, రేగాపువలసలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గిరిజనులకు ట్రైకార్ రుణాలు, సబ్సిడీతో ఇన్నోవా కార్లు, రైతు రథాలు, గిరిజనుల అభివృద్ధికి కోళ్ళు, గొర్రెల పెంపకానికి ప్రోత్సాహం, అర్హులైన ప్రతి గిరిజనులకు పెన్షన్, రేషన్ కార్డులు మంజూరు, గిరి గోరుముద్దలు, పిల్లలకు పౌష్టికాహారం కొరకు ఫుడ్ బాస్కెట్లు, గర్భిణీలకు వసతి గృహం, ప్రసవమైన గిరిజన మహిళలకు తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వంటి వాహనాలు సమకూర్చి వారి ఇంటి వద్దకే క్షేమంగా తీసుకువెళ్లి, ఖర్చులకు డబ్బులు ఇచ్చి, బేబీ కిట్స్ అందించి క్షేమంగా ఇంటికి చేర్చేవారు. ఇప్పుడు ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులకు లబ్ధి చేకూర్చే పథకాలన్నీ కనుమరుగయ్యాయని, ఉద్యోగాలు లేవు, ఉపాధి లేవన్నారు. కావున ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి, రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, వెంకటరమణ, దొర, లక్ష్మణ దొర, డొంక అన్నపూర్ణ, బుస తవుడు, అక్యాన తిరుపతిరావు, కొట్టిశా గోపాల్, రామన్నదొర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలో భూచేంద్రి గ్రామ సమీపంలో 20 లీటర్ల నాటు సారాతో సవర మొకలింగం సీతంపేట ఎస్సై నీలకంఠ రావు పట్టుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తామని తెలిపారు.

సీతంపేటలో ఆపరేషన్ స్వచ్ఛ

ప్రజాశక్తి -సీతంపేట

మండల కేంద్రంలో శనివారం ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా హోటళ్ల, ఎరువుల దుకాణాలు తనిఖీలు చేపట్టారు ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాల గురించి ప్రజలకు, వ్యాపారులకు తెలియజేశారు కార్యక్రమంలో సీతంపేట ఎస్సై ఏ నీలకంఠ రావు, లేబర్ ఆఫీసర్ కె కిరణ్‌చంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ మధుర మీనాక్షి చైల్డ్ లైన్ సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆపరేషన్ స్వచ్ఛపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలకంఠరావు

చిరుధాన్యాల దేశీయ విత్తన బ్యాంకు కేసలి

ప్రజాశక్తి - పాచిపెంట

చిరుధాన్యాల సాగుకు విత్తనం బ్యాంకుగా కేసలి గ్రామాన్ని అభివృద్ధి పర్చాలని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 పురస్కరించుకుని రాబోయే ఖరీఫ్‌కు సంబంధించి చిరుధాన్యాల దేశీయ విత్తనాలను గ్రామానికి అందించడానికి సిద్ధంగా ఉన్నామని, ఆసక్తి గల రైతులను గుర్తించి జాబితాను సిద్ధం చేసి పంపాలని రైతు సాధికారిక సంస్థ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ డాక్టర్ దేవుళ్లు ప్రకతి వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ప్రకృతి సేద్య పద్ధతిలో సాగుతున్న గులి రాగి క్షేత్రాలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎంత చిరుధాన్యాలను సాగుచేసినా, అంత మొత్తాన్ని కూడా కొనుగోలు చేస్తామని అన్నారు. కావున రైతులు కనీసం 25 సెంట్లు భూమిలో ఏదో ఒక చిరుధాన్యాల సాగును చేపట్టాలని, విత్తనాన్ని ఉచితంగానే అందిస్తామన్నారు. ఎంత విత్తనం తీసుకుంటే అంతకు రెట్టింపు విత్తనాన్ని తిరిగి రైతు సాధికారిక సంస్థకు ఇస్తే సరిపోతుందని అన్నారు. దీనివల్ల విత్తన బ్యాంకును వృద్ధిచేసి ఇతరత్రా జిల్లాలోని వివిధ గ్రామాలకు సరఫరా చేయొచ్చని అన్నారు. అలాగే ఏకపంట విధానాన్ని విడనాడి బహుళ పంటలను వేసుకోవాలని సూచించారు. ఒకే పంటను సాగు చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఆశించి పంటను నష్టపరుస్తాయన్నారు. కావున మొక్కజొన్న, పత్తి మొదలగు పంటల్లో అంతర్ పంటలతో పాటుగా ఎర్ర పంటలు, కంచె పంటలు వేసుకుంటే పురుగుల ఉధృతి గణనీయంగా తగ్గుతుందన్నారు.



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న రైతు సాధికార సంస్థ సభ్యులు

కావున రాబోయే ఖరీఫ్ సీజన్లో ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ ప్లాట్లను ఏర్పాటు చేసేలా ప్రకృతి సేద్య సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బందిని అనుసంధానం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ద్రవజీవామృతం తయారీని రైతులకు వివరించారు. అనంతరం పంట దిగుబడి పొందాలంటే భూమి సారవంతంగా ఉండాలని, దీనికి ఏకైక మార్గం నవధాన్యాలు సాగు చేసి నేలలో కలియ దున్నాలని రైతులను కోరారు. అనంతరం చిరుధాన్యాల సాగు ఆరోగ్యం బాగు, నవధాన్యాల సాగు నేలతల్లి బాగు వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించి, రైతులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, సిఆర్‌పిలు తిరుపతినాయుడు, బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి వేతనదారులు

ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధిహామీ చట్టాలన్ని సక్రమంగా అమలు చేయాలని మండలంలోని కర్రివలస జంక్షన్ వద్ద కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు తుమ్మలపాటి నారాయణ, కరణం గోపి మాట్లాడుతూ పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, నీడ కోసం టెంట్లు వేయాలని అన్నారు. గుణపాలు, పారలు పనిముట్లు అందజేయాలన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందన్నారు. అందులో భాగంగానే బడ్జెట్లో ఉపాధి హామీని నిర్వీర్యం చేసే పద్ధతిలో కేటాయింపులు చేశారని విమర్శించారు. కేరళ తరహాలో ప్రతి కూలికి రూ.600 చొప్పున కూలి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, వలసల నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. కరోనా కాలంలో పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఎక్కువ మంది ప్రజలు చేరుకున్నారని, ఈ సందర్భంగా అందరూ ఉపాధి పనులు ఇవ్వాలని కోరారు. ప్రజల పోరాటాల ఫలితంగా వచ్చిన చట్టాన్ని నిర్వీర్యం చేసే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని, రానున్న కాలంలో పార్టీలకతీతంగా కూలీలంతా ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, రూ.600 వేతనం చెల్లించాలని, కేరళ తరహాలో కూలీలకు ప్రభుత్వాన్ని ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయులు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి జీతాలు ఇవ్వండి మహాప్రభో అనే పరిస్థితికి తీసుకొచ్చి వారిపై కక్షపూరితంగా వ్యవహరించడం ప్రభుత్వానికి సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, టిడిపి పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శనివారం మండలంలోని కృష్ణపల్లిలో ఆయన మాట్లాడుతూ నాడు-నేడ పనుల పేరుచెప్పి విద్యా వ్యవస్థను రాష్ట్రంలో అందలమెక్కించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, నూతన విద్యావిధానం పేరిట అందులో విద్యార్థులను లేకుండా చేశారని విమర్శించారు. అలాగే విద్యార్థి, ఉపాధ్యాయులు నిష్పత్తిని మార్చివేసి కొత్త ఉపాధ్యాయ, ఉద్యోగాలు లేకుండా చేసి విద్యావవస్థను భ్రష్టుపట్టించిన ఖ్యాతి ముఖ్యమంత్రిదని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు బిల్లులు చెల్లించకుండా, వంట ప్రదేశాల్లో కనీసం వసతులు కల్పించకుండా చేసి, పాఠాలు చెప్పాల్సిన టీచర్లను మరుగుదొడ్లకు, నోట్స్‌బుక్‌లకు పరిమితం చేసి పాఠశాల విద్యను నిర్వీర్యం చేశారని అన్నారు. మక్కువ మండలం కోనలోని పాఠశాలలో జరిగిన ఉదంతాన్ని నెపంగా చూపిస్తూ ఉపాధ్యాయులను, సిబ్బంది సస్పెండ్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జరిగిన ప్రమాదంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపిన అనంతరం బాధ్యులపై చర్యలు చేపట్టాలని అంతేకాని, జరిగిందే తడవుగా చర్యలు చేపట్టడం అమానుషమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో డిఐఒ తనిఖీలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర, మక్కువ పిహెచ్‌సిల పరిధిలో గల ములక్కాయవలస, కాశీపట్నం గ్రామాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల టీకా నిర్వహణ కార్యక్రమాన్ని వాటి నమోదు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అక్కడకు వచ్చిన బాలింతలతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల రక్తహీనత నివారణకు వేస్తున్న ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను పరిశీలించి ఎంత మందికి వేశారని, అర్హుల జాబితాను పరిశీలించారు. అనంతరం కాశీపట్నంలో కెజిబివి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ చేసి, ఆరోగ్య నిర్వహణ రికార్డులను పరిశీలించి హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారిపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు రక్తహీనత, పౌష్టికాహారం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. అనంతరం మక్కువ, శంబర పిహెచ్‌సిలను సందర్శించి టీకా నిల్వలను, రికార్డులను పరిశీలిచారు. మక్కువ పిహెచ్‌సిలో రక్తహీనత నివారణ కోసం ఇచ్చే ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ వేసుకున్న గర్భిణితో మాట్లాడి పలు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. అటు క్షేత్ర స్థాయిలోను, ఇటు ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అన్ని వైద్య ఆరోగ్య సేవలు అందేలా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి.కిరణ్ కుమార్ రెడ్డి , సూపర్‌వైజర్ డివి రత్నం , వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

సంతకాల్లేని పోడు పట్టాలెందుకు ? : సిపిఎం



సంత వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు ప్రభుత్వం అందజేసిన పోడు భూము పట్టాలు ఇచ్చినా ఉపయోగం లేదని, వాటిపై జిల్లా అధికారుల సంతకం లేకపోవడంతో అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, అటువంటిప్పుడు ఈ పుస్తకాలెందుకని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. గిరిజన రైతులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శనివారం కోనేరు సంతలో సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు ఇచ్చిన పోడు భూముల్లో కలెక్టర్, ఐటిడిఎ పిఒ, తహశీల్దార్, విఆర్‌ఒల సంతకం ఉన్నా, అటవీ శాఖ జిల్లా అధికారి సంతకం ఎందుకు లేదని ప్రశ్నించారు. దీంతో మా సంతకాల్లేవు మా భూమి మీరు ఎలా చేస్తారంటూ కొత్తగా వచ్చిన అటవీశాఖాధికారులు గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములపైన ఇబ్బంది పెట్టే పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. గిరిజన రైతులు ఎంత పోడు భూమి సాగుచేస్తే అంత భూమికి పట్టాలివ్వాలని, అలాగే అటవీ శాఖ జిల్లా స్థాయి అధికారులు సంతకాలు పెట్టాలని అలాగే పట్టాలిచ్చిన ప్రాప్తికి రుణాలు మంజూరు చేయాలని కోరారు.

కొమరాడ మండలంలో చిన్న ఖర్జెల పంచాయతీకి చెందిన చెందిన సీసాడవలస, దేవుకోన పంచాయతీ అంటివలసలో గిరిజనులకు పోడు భూమి సాగు చేసిన మేరకు పూర్తిస్థాయిలో భూమికి పట్టాలు ఇవ్వడంలేదని అన్నారు. తక్షణమే ఐటిడిఎ పిఒ స్పందించి ఐటిడిఎ పరిధిలో గల 8మండలాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములపై రీసర్వే చేసి గిరిజనులు ఎంత భూమి సాగు చేస్తే అంత భూమికి పట్టాలివ్వాలని ఆ పట్టాల ప్రాప్తికి బ్యాంకుల్లో రుణాలిచ్చేలా ఆదుకోవాలని కోరారు. లేనిచో కలెక్టరేట్ వద్ద భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.ఇందిర శ్రీను, ప్రసాద్, లక్ష్మణావు, వెంకట్రావు, రాజు, లక్ష్మి, పద్మమ్మ, గౌరమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

'వేదాంత'లో విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి- పార్వతీపురం

స్థానిక పోల్ మెమెరియల్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం వేదాంత జూనియర్ కళాశాల ఫెయిర్‌వెల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజర్ కెటి నాయుడు, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు పాల్గొన్నారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ వేదాంత కళాశాల చీఫ్ మెంటర్ అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ఎల్ నాయుడు అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ రేంజర్ కెటి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల చదువులు పూర్తయి ఉద్యోగం సంపాదించాక అదే జీవితమని ఆగిపోకుండా అంతకంటే ఉన్నతమైన స్థానాలకు ఎదిగేందుకు ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, లక్ష్యం ప్రధానంగా అలవర్చుకోవాలన్నారు. కవి గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మేధస్సు సంపదన్నారు. అందుకు విద్యార్థి దశలోనే ఖ్యాతి గడించిన మహానుభావులందరి విశేషాలను పుస్తకాల్లో చదివి గొప్పవారుగా తయారు కావాలన్నారు. అనంతరం ఐఐటి, నీట్‌ల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను సన్మానించారు. విద్యార్థులు ఆటపాటలతో ఘనంగా సీనియర్స్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫారెస్ట్ రేంజ్ కెటి నాయుడును సన్మానిస్తున్న కాలేజీ సిబ్బంది

అందుబాటులో అధునాతన వైద్య సేవలు

ప్రజాశక్తి-విజయనగరం

సామాన్య మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో అధునాతన వైద్య సేవలు అందించడమే కార్పొరేట్ ఆసుపత్రుల లక్ష్యం కావాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తిరుమల ఆసుపత్రి అధునాతన వైద్య సేవలు అందించడంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. అత్యంత క్లిష్టమైన కేసులను కూడా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన కేసులు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. ధనార్జనే ధ్యేయం కాకుండా పేద, మధ్య తరగతి వర్గాలకు అధునాతన వైద్యం అందించినప్పుడే కార్పొరేట్ ఆసుపత్రి యాజమా న్యాలకు ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణ శాంతి, మెడి కవర్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ పద్మజ, ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ పిఎస్‌వి రామారావు, డాక్టర్ మహేశ్వర రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

13న పింఛనర్లకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో బెలగాంలో రైతు బజార్ పక్కన ఉన్న పెన్షనర్ల భవనంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు, నెలవారీ సమావేశం, పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులంతా హాజరుకావాలని, పెన్షన్‌దారులంతా కంటి పరీక్షల కొరకు తమ ఇహెచ్ఎస్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను తీసుకురావాలని, పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంట జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నడిమికెల్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెల్లలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రక్తపోటు గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, మధుమేహ వంటి వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం శకుంతల, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి - భామిని

ఒడిశా నుంచి ఆంధ్రాకు ఇటీవల వచ్చిన 6 కొత్త ఏనుగులు పకుడిభద్ర మెట్టపై ఉన్నాయని, వేకువజామున పొలాలకు, జీడీ తోటలకు, మామిడి తోటలకు ఎవరు ఒంటరిగా వెళ్లొద్దని, అదే విధంగా రాత్రుళ్లు పనులపై ప్రజలు గ్రామ పరిసరాల్లో తిరగొవద్దని మనుమకొండ పంచాయితీ పరిధిలోని మనుమకొండ, కొత్తూరుగూడ, బొమ్మికలో దండోరా వేశారు. ఏనుగుల సంచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మనంకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపిటిసి పత్తిక మురళి, మనుమకొండ, కొత్తూరుగుడ, బొమ్మికలో డప్పులతో తిరుగుతూ శుక్రవారం రాత్రి చాటింపు చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

కురుపాం: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనం ధ్రువీకరణ పత్రాలను, డ్రంకెన్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం యువతకు, వాహనదారులకుతో వాహనాలు నడిపే విధానం, ఉండాల్సిన ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని లేనిచో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నియంత్రణ

సీతానగరం : స్థానిక స్వర్ణముఖి నది వంతెనపై ప్రతిరోజు వాహనాలు నిలిచిపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు వాహనాలను నియంత్రించారు. ఎవరికి ఇబ్బందులు కలగ కుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇరువైపుల నుంచి వాహనాలను తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ జాం కాకుండా వాహనాలను పంపించారు. ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు గురికాకుండా చర్యలు తీసుకోవడంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్మశాన వాటికకు స్థలం మంజూరు

పాలకొండ : ఐదో వార్డు పరిధిలోని గాయత్రి నగర్ వాసుల చిరకాల కోరిక నెరవేరింది. కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పరిష్కారానికి నోచుకోని శ్మశాన వాటిక స్థల సమస్య నేడు పరిష్కారమైంది. కొండాపురానికి ఆనుకుని ఉన్న 10 సెంట్లు స్థలంలో గాయత్రి నగర్ శ్మశాన వాటిక కోసం ఐదు సెంట్లు స్థలాన్ని ఇవ్వడానికి గ్రామపెద్దలు అంగీకారం తెలిపారు. దీనికోసం కృషి చేసిన స్థానిక తహశీల్దార్ సోమేశ్వరరావు, డిటి బుచ్చయ్య, ఐదో వార్డ్ కౌన్సిలర్ మన్మధరావుకు గాయత్రి నగర్ వాసులంతా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా డిటి బుచ్చయ్య చూపిన చొరవ అభినందనీయమని గాయత్రీనగర్ వాసులు గంగు రామారావు, ఎంఎల్ఎన్ మాస్టర్, నారాయుడు, హేమని తెలిపారు.

సంగాంలో సిఐ పర్యటన

వంగర : మహా శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు సంగాంలో జాతర జరగనున్న నేపథ్యంలో రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు ఆ గ్రామంలో పర్యటించారు. అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదులు కలిసే త్రివేణి సంగమం, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులతో సిఐ మాట్లాడి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.